




# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 166 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/- | మంగళవారం 21 జనవరి 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# నక్సల్స్ లేని భారత్ దిశగా కీలక అడుగు: అమిత్ షా

**దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉందని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా అన్నారు.**

(రిపబ్లిక్ న్యూస్), జనవరి 21: ఛత్తీస్ గఢ్- ఒడిశా సరిహద్దులో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా భద్రతా బలగాలు ఇప్పటికీ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. దీనిపై తాజాగా కేంద్ర హెూంమంత్రి అమిత్ షా స్పందించారు. ఇది నక్సల్స్ లేని భారత్ దిశగా కీలక అడుగని వ్యాఖ్యానించారు.



దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉందన్నారు. ఇది నక్సలిజానికి గట్టి ఎదురుదెబ్బ. మన భద్రతా బలగాలకు ఇది గొప్ప విజయం. నక్సల్స్ లేని భారత్ దిశగా ఇది ఓ కీలక అడుగు. దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉంది. సీఆర్పీఎఫ్, ఒడిశా, ఛత్తీస్గఢ్కు చెందిన బలగాలు ఈ జాయింట్ ఆపరేషన్లో భాగమయ్యాయి" అని అమిత్ షా స్పందించారు. ఛత్తీస్గఢ్-ఒడిశా సరిహద్దు జిల్లాలైన గరియాబంద్, నౌపాడలో జనవరి 19 రాత్రి నుంచి ఈ ప్రత్యేక ఆపరేషన్ జరుగుతోంది. పలుమార్లు జరిగిన ఎన్కౌంటర్లలో ఇప్పటివరకు 20 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో కీలక నేతలు కూడా ఉన్నారు.

## స్థిరాస్తి దళారిపై చేయిచేసుకున్న ఎంపీ ఈటల రాజేందర్

**భాజపా ఎంపీ ఈటల రాజేందర్ ఓ స్థిరాస్తి దళారిపై చేయి చేసుకున్నారు.**

పోచారం,జనవరి 21, (రిపబ్లిక్ న్యూస్): భాజపా ఎంపీ ఈటల రాజేందర్ ఓ స్థిరాస్తి దళారిపై చేయి చేసుకున్నారు. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఈ ఘటన చోటుచేసుకుంది. మున్సిపాలిటీలోని ఏకశిలానగర్ లో మంగళవారం ఈటల పర్యటించారు.




బాధితుల ఫిర్యాదుతో స్థిరాస్తి దళారిపై ఈటల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆయనపై చేయిచేసుకున్నారు. ఇంటి స్థలాల యజమానులను ఇబ్బంది పెడుతున్నారని ఎంపీ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. "పేదలు కొనుక్కున్న జాగాలకు భాజపా అండగా ఉంటుంది. కొందరు అధికారులు బ్రోకర్లకు కొమ్ముకాస్తున్నారు. భూములు కొనుక్కున్న పేదల సమస్యలపై కలెక్టర్, సీపీతో మాట్లాడాను. కొందరు దొంగ పత్రాలతో పేదల భూములను లాక్కుంటున్నారు. బ్రోకర్లకు సహకరించే అధికారులపై చర్యలు తీసుకోవాలి. దళారులతో పోలీసులు, అధికారులు కుమ్మక్కవుతున్నారు. కూల్చివేతలు తప్ప.. పేదల కన్నీళ్లు పట్టించుకోవడం లేదు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పేపర్ లీక్ యువత హక్కులను హరించడమే.. :భాజపాపై రాహుల్ ఆరోపణ

**భాజపా పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీకులు జరుగుతున్నాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు.**

దిల్లీ, జనవరి 21, (రిపబ్లిక్ న్యూస్): భాజపాపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. భాజపా పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీకేజీ ఘటనలు నమోదవుతున్నాయన్నారు. పేపర్ లీక్లను యువత హక్కులను కాలరాసే ఆయుధంగా కాషాయ పార్టీ మార్చుకుందని ఆరోపించారు. "భాజపా పాలిత రాష్ట్రాల్లో నిత్యం ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. నిరసనలు చేపట్టిన బీపీఎస్సీ అభ్యర్థులపై పోలీసులు లాఠీ ఛార్జీ చేశారు. అభ్యర్థులను కలిసినప్పుడు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. పేపర్ లీక్ అయితే.. కచ్చితంగా అది సోషల్ మీడియాలో వైరల్గా మారుతుంది. ప్రస్తుతం అభ్యర్థులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. గాంధేయ మార్గంలో నిరసన తెలుపుతున్న వారిపై



పోలీసులు దాడికి యత్నించారు. బాధితులపై కేసులు పెట్టారు" అని రాహుల్ గాంధీ తన యూట్యూబ్ ఛానెల్ లో వీడియో పోస్టు పెట్టారు. "28 పరీక్షా కేంద్రాల్లో రిగ్గింగ్ జరిగినా ప్రభుత్వం ఇంకా అంగీకరించేందుకు సిద్ధంగా లేదు. ఇది కేవలం బిహార్ కు సంబంధించిన సమస్య కాదు. యావత్ దేశానికి చెందిన సమస్య. అభ్యర్థుల నిరసనల అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతాం" అని హామీ ఇచ్చారు. కాగా.. గతేడాది డిసెంబర్ 13న నిర్వహించిన బీపీఎస్సీ కంబైన్డ్ కాంపిటేటివ్ పరీక్ష ప్రశ్నపత్రం లీకైనట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో నిరుద్యోగులు ఆందోళన చేపట్టారు. పరీక్షను రద్దు చేసి.. కొత్తగా మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

# గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్గా ఏపీ : దావోస్లో సీఎం చంద్రబాబు

**భారతీయుల రక్తంలోనే వ్యాపార లక్షణాలు ఉన్నాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.**

దావోస్, జనవరి 21, (రిపబ్లిక్ న్యూస్): భారతీయుల రక్తంలోనే వ్యాపార లక్షణాలు ఉన్నాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రపంచ దేశాలకు భారతీయులు అత్యుత్తమ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. దావోస్లో ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా సీఐఐ ఆధ్వర్యంలో గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్ పై నిర్వహించిన సదస్సులో సీఎం మాట్లాడారు. "మీ అందర్నీ చూస్తుంటే నాలో నమ్మకం పెరిగింది. భవిష్యత్తులో నా కలలు నిజమవుతాయనే నమ్మకం కలిగింది. రెండున్నర దశాబ్దాల్లో హైదరాబాద్ అభివృద్ధి చెందింది.



భారత్లో అత్యంత నివాసయోగ్యమైన నగరంగా తీర్చిదిద్దడంలో ఎంతో కృషి చేశాం. అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. 25 ఏళ్ల కిందట బిల్ గేట్స్ ఐటీ సేవలను తీసుకొచ్చారు. 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారు. ఇంటర్నెట్, ఆర్థిక సంస్కరణలను వినియోగించి రెండో తరం సంస్కరణలను ప్రవేశపెట్టాను. 1999లో తొలిసారిగా విద్యుత్ సంస్కరణలు ప్రారంభమయ్యాయి. పాలనా వ్యవస్థలో ఉన్న వ్యక్తిగా ఆ సంస్కరణలు తీసుకువచ్చినందుకు ఎన్నికల్లో ఓడిపోయా. ఇప్పుడు ఆ విధానాలే ప్రజలకు అనుకూలంగా, అత్యుత్తమంగా మారిపోయాయి.

### ఈవీ వాహనాలు ఉత్పత్తికి ప్రోత్సాహకాలు

2014లో మరోమారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక సౌర విద్యుత్పై ఎక్కువ దృష్టి పెట్టాం. ఇప్పుడు ప్రధాన మంత్రి సూర్యఘర్ కింద ఇంటింటికీ సౌర ఉత్పత్తి చేయాలని ఓ విధాన నిర్ణయం ప్రకటించారు. సంప్రదాయేతర ఇంధన వనరుల్లో సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిపై ఎక్కువ దృష్టి పెట్టాం. అలాగే పంప్డ్ స్టోరేజీ ద్వారా హైడల్ విద్యుత్ ఉత్పత్తిపైనా ఏపీలో ఎక్కువ దృష్టి పెట్టాం. 115 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు ఇంధన వనరుల్లో వస్తున్నాయి. 500 మెగావాట్ల, 5 ఎంపీటీఏ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతున్నాం. 21 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఎన్టీపీసీ-ఏపీ జెన్కో సంయుక్తంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతున్నాయి. ఏపీ గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్ మారబోతోంది. ఏపీలో విద్యుత్ ఉత్పాదనకు మంచి అవకాశాలున్నాయి. సుదీర్ఘమైన తీరప్రాంతం, రవాణాకు అందుబాటులో పోర్టులు ఉన్నాయి. ఈవీ వాహనాలు ఉత్పత్తి చేసేందుకు ఏపీ ప్రోత్సాహకాలు అందిస్తుంది. పీఎం సూర్యఘర్ కింద ఇంటింటికీ సౌరఫలకాలు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేయబోతున్నాం. అత్యంత తక్కువ ఖర్చుతోనే ఈ విద్యుత్ ప్రజలకు అందుబాటులోకి రావాలి. ఓవైపు పర్యావరణాన్ని సంరక్షిస్తూనే ఈ విద్యుత్ ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగాల్సి ఉంది.

### ఎక్కడికి వెళ్లినా ఏపీ పారిశ్రామిక వేత్తలు


రాష్ట్రంలో ఆర్గానిక్ వ్యవసాయం పైనా దృష్టి పెట్టాం. గ్లోబల్ కమ్యూనిటీ కోసం ఏపీ ఓ మంచి మోడల్ అవుతుంది. విధాన రూపకర్తగా ప్రజల ప్రయోజనాల కోసం మాట్లాడుతూనే పరిశ్రమలకూ ప్రోత్సాహకాలు అందిస్తాం. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ ను ఉత్పత్తి చేసేందుకు ఏపీలో ఉన్న అవకాశాలు వినియోగించుకోవాలని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నాం. ఎక్కడికి వెళ్లినా ఏపీ పారిశ్రామికవేత్తలే కనిపిస్తున్నారు. భారతీయులు అందిస్తున్న సేవలపట్ల గర్విస్తున్నాను. భవిష్యత్తులోనూ ఇదే తరహాలో సేవలు అందించాలి. ప్రపంచంలోని అనేక దేశాల్లో రాజకీయ అనిశ్చితి ఉంది. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్లో స్థిరమైన ప్రభుత్వం ఉంది"అని చంద్రబాబు అన్నారు.

## 'డిప్యూటీ సీఎం' అంశంపై ఎవరూ స్పందించవద్దు :జనసేన కేంద్ర కార్యాలయం

**ఏపీ మంత్రి నారా లోకేశ్ను డిప్యూటీ సీఎం చేయాలని పలువురు తెదేపా నేతలు కోరుతున్న నేపథ్యంలో ఈ అంశం రాజకీయా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.**

అమరావతి, జనవరి 21, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ మంత్రి నారా లోకేశ్ను డిప్యూటీ సీఎం చేయాలని పలువురు తెదేపా నేతలు కోరుతున్న నేపథ్యంలో ఈ అంశం రాజకీయా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత కొన్ని రోజులుగా తెదేపా, జనసేన నేతలు ఎవరికి తోచిన విధంగా వారు స్పందిస్తున్నారు.

ఈక్రమంలో జనసేన పార్టీ అధిష్ఠానం మంగళవారం స్పందించింది. ఇకపై ఈ వ్యవహారంలో పార్టీకి చెందిన నేతలెవరూ బాహాటంగా స్పందించవద్దని, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టొద్దని జనసేన కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఇదే అంశంపై తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం కూడా సోమవారం ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. లోకేశ్ డిప్యూటీ సీఎం అంశంపై ఎవరూ మాట్లాడవద్దని పార్టీ నేతలను ఆదేశించింది. ఎవరూ మీడియా వద్ద బహిరంగ ప్రకటనలు చేయవద్దని సూచించింది. ఏ నిర్ణయమైనా కూటమి నేతలు కూర్చొని మాట్లాడుకుంటారని స్పష్టం చేసింది. వ్యక్తిగత అభిప్రాయాలను పార్టీపై రుద్దవద్దని పేర్కొంది.




## లింగంపల్లి రైల్వే స్టేషన్లో ప్రయాణికుల ఆందోళన

**నగరంలోని లింగంపల్లి రైల్వే స్టేషన్లో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. చిత్తాపూర్ ఎక్స్ ప్రెస్ సరైన సమయానికి రావడం లేదని నిరసన వ్యక్తం చేశారు.**

హైదరాబాద్, జనవరి 21, (రిపబ్లిక్ న్యూస్): నగరంలోని లింగంపల్లి రైల్వే స్టేషన్లో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. చిత్తాపూర్ - సికింద్రాబాద్ మధ్య నడుస్తోన్న చిత్తాపూర్ ఎక్స్ప్రెస్ సరైన సమయానికి రావడం లేదని నిరసన వ్యక్తం చేశారు. లింగంపల్లి రైల్వే స్టేషన్కు చేరుకున్న తర్వాత రైలును అడ్డుకొని ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ప్రతిరోజు ఉదయం 7:30 గంటలకు లింగంపల్లి రైల్వే స్టేషన్కు చేరుకోవాల్సిన రైలు.. మూడు, నాలుగు గంటలు ఆలస్యంగా నడుస్తుండటంతో ఉద్యోగాలకు వెళ్లే వారు సకాలంలో కార్యాలయాలకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కచ్చితమైన సమయ వేళలు పాటించాలని డిమాండ్ చేస్తూ ప్రయాణికులు పట్టాలపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న లింగంపల్లి పోలీసులు ఆందోళన చేస్తున్న ప్రయాణికులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్కు తరలించారు.



## గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల తేదీలు ప్రకటించిన ఏపీపీఎస్సీ

**గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల తేదీలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది.**

అమరావతి, జనవరి 21, (రిపబ్లిక్ న్యూస్): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల తేదీలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. మే 3 నుంచి 9 వరకు మెయిన్స్ నిర్వహించాలని నిర్ణయించింది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను డిస్క్రిప్టివ్ టైప్లో నిర్వహిస్తామని, ప్రశ్నపత్రాన్ని ట్యాబ్లో ఇవ్వాలని నిర్ణయించినట్టు ఏపీపీఎస్సీ కార్యదర్శి తెలిపారు. ఏపీలో మొత్తం 81 గ్రూప్ -1 పోస్టుల భర్తీకి గతేడాది మార్చి 17న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. మొత్తం 1,48,881మంది ప్రిలిమ్స్కు దరఖాస్తు చేసుకోగా.. 4,496మంది మెయిన్స్కు అర్హత సాధించారు.



ANDHRA PRADESH PUBLIC SERVICE COMMISSION :: VIJAYAWADA

SCHEDULE FOR GROUP-I (MAINS) EXAMINATIONS (NOTIFICATION NO.12/2023)

WEB NOTE

It is hereby informed that the Mains - Written Examination (Descriptive Type) for Group-I Services (Notification No.12/2023) is scheduled to be held from 03.05.2025 to 09.05.2025. The detailed Time Table is as hereunder:

| Date of Examination and Timings | Subject |
|---|---|
| 03.05.2025 FN (10.00 AM to 01.00 PM) | Paper in Telugu (Qualifying Nature) |
| 04.05.2025 FN (10.00 AM to 01.00 PM) | Paper in English (Qualifying Nature) |
| 05.05.2025 FN (10.00 AM to 01.00 PM) | Paper-I - General Essay - on contemporary themes and issues of Regional, National and International importance |
| 06.05.2025 FN (10.00 AM to 01.00 PM) | Paper-II - History and Cultural and Geography of India and Andhra Pradesh |
| 07.05.2025 FN (10.00 AM to 01.00 PM) | Paper-III - Polity, Constitution, Governance, Law and Ethics |
| 08.05.2025 FN (10.00 AM to 01.00 PM) | Paper-IV - Economy and Development of India and Andhra Pradesh |
| 09.05.2025 FN (10.00 AM to 01.00 PM) | Paper-V - Science, Technology and Environmental Issues |

The Mains - Written Examination (Descriptive Type) for Group-I Services will be conducted by displaying the Question Paper on Tabs.

Vijayawada,
Date: 21.01.2025.

Sd/- I.Narasimha Murthy,
Secretary (FAC).

## ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడలో మ్యూజికల్ నైట్

**తలసేమియా వ్యాధిపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'యుఫోరియా మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నట్టు ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ నారా భువనేశ్వరి తెలిపారు.**

అమరావతి, జనవరి 21, (రిపబ్లిక్ న్యూస్): తలసేమియా వ్యాధిపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'యుఫోరియా మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నట్టు ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. విజయవాడలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా ఫిబ్రవరి 15న కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ను కూడా ఆహ్వానిస్తామని నారా భువనేశ్వరి తెలిపారు. "ఎన్టీఆర్ కష్టపడి పైకి వచ్చారు. రాజకీయ రంగంలో ఏమీ ఆశించకుండా ప్రజల కోసం ముందుకు నడిచారు. పేదల కోసం ఎన్నో పథకాలు తెచ్చారు. రెండు రూపాయలకు కిలో బియ్యం, ఆడపిల్లలకు ఆస్తిలో సమానహక్కు వంటివి ఆయన తెచ్చినవే. ప్రజా నాయకుడు చంద్రబాబు.. ప్రజలకు విద్య, వైద్యం అందించేందుకు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ స్థాపించారు. ఏ ప్రభుత్వ సహాయం తీసుకోకుండా ముందుకు సాగుతున్నాం. ఫైలిన్, హుద్ హుద్, కేరళలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంతో మందికి సాయమందించాం. తలసేమియా బారిన పడిన వారికి సహాయం చేసేందుకు బ్లడ్ బ్యాంక్ నిర్వహిస్తున్నాం. కొందరికి రక్తదానం అంటే భయం, మరి కొందరికి ఇష్టం ఉండదు. బ్లడ్ డొనేషన్ సమాజానికి ఎంతో మంచి చేస్తుంది. ప్రతి రక్తపు చుక్క ప్రజల ప్రాణాలను కాపాడుతుంది. మేము అడిగిన వెంటనే మ్యూజికల్ నైట్ నిర్వహించేందుకు తమన్ అంగీకరించారు. కుటుంబ సమేతంగా వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతున్నా. బుక్ మై షోలో టికెట్స్ అందుబాటులో ఉన్నాయి. మీరు కొన్న టికెట్స్ డబ్బుని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తాం" అని భువనేశ్వరి తెలిపారు.




printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1924:** రష్యా నాయకుడు లెనిన్ మరణం (జ.1870). (చిత్రంలో)
- **1945:** ప్రముఖ స్వాతంత్ర్య సమర–యోధుడు రాష్ బిహారీ బోస్ మరణం (జ.1886).
- **1959:** ప్రముఖ తెలుగు రచయిత ఎండ్లూరి సుధాకర్ జననం (మ.2022).
- **1950:** ప్రసిద్ధి చెందిన ఒక ఆంగ్ల రచయిత, పాత్రికేయుడు జార్జ్ ఆర్వెల్ మరణం (జ.1903).
- **1972:** త్రిపుర, మేఘాలయ రాష్ట్రాలు ఏర్పడ్డాయి.
- **2011:** తెలుగు సినిమా పరిశ్రమలో ప్రసిద్ధ దర్శకుడు ఇ.వి.వి.సత్యనారాయణ మరణం (జ.1958).
- **1988:** ప్రముఖ నర్తకి హిమ బాల జననం.


లెనిన్


రాష్ బిహారీ బోస్


ఎండ్లూరి సుధాకర్


జార్జ్ ఆర్వెల్


త్రిపుర, మేఘాలయ రాష్ట్రాలు


ఇ.వి.వి.సత్యనారాయణ

రిపబ్లిక్ స్పోర్ట్స్

## పంత్ కనీసం ఐదు ఐపీఎల్ టైటిళ్లు సాధిస్తాడు: సంజీవ్ గొయెంకా

రిషబ్ పంత్ వచ్చే 14-15 ఏళ్లు ఎల్ఎస్‌జీ తరఫున ఆడతాడని, ఈ కాలంలో కనీసం ఐదు ఐపీఎల్ టైటిళ్లు సాధిస్తాడని లఖ్ నవూ యజమాని సంజీవ్ గొయెంకా ఆశాభావం వ్యక్తంచేశారు.



లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు కొత్త కెప్టెన్ వచ్చాడు. కేఎల్ రాహుల్ను వదులుకున్న లఖ్నవూ.. మెగా వేలంలో రిషబ్ పంత్‌కు భారీ ధర వెచ్చించి దక్కించుకుంది. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర రూ.27 కోట్లతో పంత్ సొంతం చేసుకున్న లఖనవూ.. అతడికే సారథ్య బాధ్యతలు కూడా అప్పగించింది. సోమవారం కోల్కతాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆ ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గొయెంకా ఈ విషయాన్ని వెల్లడించారు. అనంతరం గొయెంకా మాట్లాడారు. పంత్ వచ్చే 14–15 ఏళ్లు ఎల్ఎస్ తరఫున ఆడతాడని, ఈ కాలంలో కనీసం ఐదు ఐపీఎల్ టైటిళ్లు సాధిస్తాడని ఆశాభావం వ్యక్తంచేశారు. 'రిషభ్ పంత్ ఐపీఎల్ లో అత్యంత విజయవంతమైన ఆటగాడిగా మాత్రమే కాక టోర్నీలో అత్యుత్తమ ఆటగాడు అవుతాడని నమ్ముతున్నా. ఆటపై ప్రేమ, గెలవాలనే తపన ఉన్న ఇలాంటి ఆటగాళ్లను నేను చూడలేదు. ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లను విజయవంతమైన జట్లుగా చెబుతారు. మహేంద్రసింగ్ ధోనీ, రోహిత్ శర్మ అద్భుతంగా ఆ టీమ్ ను ముందుండి నడిపించారు. నా మాటలు గుర్తుంచుకోండి. 10 ఏళ్ల తర్వాత ప్రజలు ధోనీ, రోహిత్‌తోపాటు పంత్ పేరును చెబుతారు. భారీ ధర దక్కించుకోవడంతో పంత్పై అదనపు ఒత్తిడి ఉండదు. వేలం పూర్తవడంతోనే దాని గురించి చర్చ ముగిసింది. ప్రతి జట్టు రూ.120 కోట్లు ఖర్చు చేసింది. ఒకే ఆటగాడి కోసం ఎంత ఖర్చు చేశారనేది, మిగిలిన ఆటగాళ్ల కోసం ఎంత వెచ్చించారన్నది ముఖ్యం కాదు' అని సంజీవ్ గొయెంకా పేర్కొన్నారు. "లఖ్నవూకు తొలి టైటిల్ అందించేందుకు 200 శాతం కృషి చేస్తా. నూతన ఉత్తేజంతో ఎల్ఎస్ తరఫున ఆడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. కొత్త జట్టు.. కొత్త ఫ్రాంచైజీ.. కానీ కెప్టెన్గా నా దృక్పథం మారదు. సారథిగా సహచరులతో ఎలా నడుచుకోవాలో రోహిత్ భాయ్ నుంచే నేర్చుకున్నా. ఆటగాళ్లపై నమ్మకముంచితే ఊహించని ఫలితాలు వస్తాయి" అని పంత్ తెలిపాడు. ఐపీఎల్లో ఒక జట్టుకు కెప్టెన్గా ఉండడం పంత్కు ఇది రెండోసారి. 2016 నుంచి దిల్లీ క్యాపిటల్స్కు ఆడిన పంత్.. 2021లో కెప్టెన్గా ఎంపికయ్యాడు. 2022 ఏడాది చివర్లో ఘోర రోడ్డు ప్రమాదంలో చిక్కుకొని ప్రాణాలతో బయటపడ్డాడు. 2024లో పునరాగమనం చేసి తిరిగి దిల్లీని నడిపించాడు. పంత్ లేని సమయంలో (2023 సీజన్) శ్రేయస్ అయ్యర్ దిల్లీకి కెప్టెన్గా ఉన్నాడు.

## నిర్మాత దిల్ రాజు ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ సోదాలు

ప్రముఖ నిర్మాత. తెలంగాణ ఎఫ్‌ఎసీ చైర్మన్ దిల్ రాజు ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.



ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఎఫ్‌ఎసీ చైర్మన్ దిల్ రాజు ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. దీనితో పాటు ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ కార్యాలయాలు, 'పుష్ప 2' చిత్రం నిర్మాత నవీన్ ఎర్నేని నివాసంలో సోదాలు కొనసాగుతున్నాయి. ఏకకాలంలో 8 చోట్ల 55 బృందాలతో తనిఖీలు జరుగుతున్నాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ దిల్ రాజు ఇళ్లతో పాటు ఆయన సోదరుడు శిరీశ్, కుమార్తె హన్సితరెడ్డి నివాసాల్లోనూ ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. వ్యాపార భాగస్వాముల నివాసాల్లోనూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. వివిధ పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

## నా జీవితంలో అత్యంత భయానక క్షణాలవే.. : మాధవన్

తన కెరీర్ గురించి మాధవన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. 25 ఏళ్ల నుంచి ఇండస్ట్రీలో కొనసాగడం సులభం కాదన్నారు.



భాషతో సంబంధం లేకుండా అభిమానులను సొంతం చేసుకున్నారు నటుడు మాధవన్. తాజాగా ఆయన నటించిన 'హిసాబ్ బరాబర్ జీ5 వేదికగా విడుదలకు సిద్ధమైంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి మాట్లాడారు. తన సినిమా రిలీజ్ అవుతుందంటే ఇప్పటికీ ఎంతో భయపడతానని అన్నారు. "మరికొన్ని గంటల్లో నా సినిమా ప్రేక్షకుల ముందుకురానుందంటే భయాందోళనకు గురవుతాను. నిజం చెప్పాలంటే నా కెరీర్ లో రెండే క్షణాలు నరాలు తెగేంత ఉత్కంఠ కలిగిస్తాయి. సినిమా షూట్లో మొదటి రోజు భయం వేస్తుంది. అలాగే సినిమా విడుదల మొదటి రోజు అలాంటి ఆందోళనే ఉంటుంది. రిలీజ్ రోజు ప్రజల అభిప్రాయాలు బయటకు వస్తాయి. ఆశించిన స్థాయిలో లేకపోతే 'నీ గేమ్ ఓవర్ అని అంటారేమోనని భయపడతాను. ఇలాంటి పరిశ్రమలో 25 ఏళ్లుగా కొనసాగడం సులభం కాదు. కొందరు హీరోలు 25 నెలల్లోనే అవకాశాలు కోల్పోతారు. ఈ విషయంలో నేను అదృష్టవంతుడిని. నన్ను ఎంతోమంది ప్రేక్షకులు ఇప్పటికీ ఆదరిస్తున్నారు. వారందరికీ కృతజ్ఞతలు. వారి అభిమానమే నన్ను ఇంకా పరిశ్రమలో కొనసాగేలా చేస్తోంది. అది లేకపోతే నేను ఎప్పుడో కనుమరుగయ్యేవాడిని" అని చెప్పారు. ఇక ఓటీటీల గురించి మాట్లాడుతూ.. "ఒక్కోసారి కథ ఆధారంగా నిడివి ఎక్కువ ఉన్న కంటెంట్ చేయాల్సివస్తుంది. వాటిని థియేటర్ లో విడుదల చేయలేం. ఇప్పటివరకు ఓటీటీలో వచ్చిన నా ప్రాజెక్టన్నీ మంచి ఆదరణను సొంతం చేసుకున్నాయి. కొన్ని ప్రాజెక్టు ఎనిమిది ఎపిసోడ్లు కూడా ఉన్నాయి. అలాంటి కథను తగ్గించి థియేటర్లో విడుదల చేయలేం కదా.. ఇప్పుడు 'హిసాబ్ బరాబర్ కూడా అలాంటి కథే. అందుకే ఓటీటీలో విడుదల చేస్తున్నాం. అందరూ ఆదరిస్తారనే నమ్మకం ఉంది" అని చెప్పారు. మాధవన్ హీరోగా అశ్వినీధీర్ తెరకెక్కించిన చిత్రం 'హిసాబ్ బరాబర్'. ఇందులో ఆయన నిజాయితీ గల టికెట్ కలెక్టర్ పాత్రలో నటించారు. జియో స్టూడియోస్ నిర్మించింది. జనవరి 24 నుంచి జీ5 వేదికగా స్ట్రీమింగ్ కానుంది.

రిపబ్లిక్ సినిమా CINEMA

## తండ్రి కాబోతున్న కిరణ్ అబ్బవరం.. ఫొటో షేర్ చేసిన హీరో

నటుడు కిరణ్ అబ్బవరం శుభవార్త చెప్పారు. త్వరలో తాను తండ్రి కాబోతున్నట్లు తెలిపారు.



టాలీవుడ్ హీరో కిరణ్ అబ్బవరం శుభవార్త చెప్పారు. తాను తండ్రిని కాబోతున్నట్లు వివరించారు. ఈ విషయాన్ని తెలుపుతూ మంగళవారం ఉదయం పోస్ట్ పెట్టారు. తన సతీమణి రహస్యతో దిగిన స్పెషల్ ఫొటోను అభిమానులతో పంచుకున్నారు. 'మా ప్రేమ పెరుగుతోంది' అని ఆ ఫొటోకు క్యాప్షన్ పెట్టారు. ఈ సంతోషకరమైన సమయంలో అందరి ఆశీస్సులు తమకు ఉండాలని కోరుకున్నారు. దీనిపై నెటిజన్లు స్పందిస్తూ.. కిరణ్–రహస్య దంపతులకు శుభాకాంక్షలు చెబుతున్నారు. 'రాజావారు.. రాణిగారు' (2019)తో కిరణ్ తెరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. అందులో రహస్య హీరోయిన్గా నటించారు. ఆ మూవీ షూటింగ్లో లోనే ఇద్దరి మధ్య ఏర్పడిన స్నేహం.. తర్వాత ప్రేమగా మారింది. గతేడాది ఆగస్టులో వీరిద్దరూ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. కుటుంబసభ్యులు, కొద్దిమంది అతిథుల సమక్షంలో వీరి వివాహం జరిగింది. ఇక సినిమాల విషయానికొస్తే.. ఇటీవల 'క'తో కిరణ్ అబ్బవరం సూపర్హిట్ను అందుకున్నారు.

## ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ కానున్న సైఫ్ అలీఖాన్

**ఈనెల 16న దుండగుడి దాడిలో గాయపడిన సైఫ్ అలీఖాన్ నేడు ఆసుపత్రి నుంచి డిశార్జ్ కానున్నారు. ఈ విషయాన్ని లీలావతి ఆసుపత్రి వైద్యులు ధ్రువీకరించారు.**

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ ఆసుపత్రి నుంచి నేడు డిశ్చార్జ్ కానున్నారు. లీలావతి ఆసుపత్రి వైద్యులు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు సైఫ్ను డిశ్చార్జ్ చేసే అవకాశం ఉంది. ఇప్పటికే డిశ్చార్జ్కు సంబంధించిన పనులు పూర్తయినట్లు తెలుస్తోంది. ఈనెల 16న సైఫ్ ఇంటికి చోరీకి వెళ్లిన దుండగుడు ఆయనపై దాడి చేసిన సంగతి తెలిసిందే. కత్తిపోట్లకు గురైన నటుడు ముంబయిలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. సైఫ్ వెన్నెముకకు తీవ్రగాయం కావడంతో సర్జరీ చేసిన వైద్యులు వెన్నెముక నుంచి కత్తిని తొలగించారు. మరోవైపు ఈ కేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు బంగ్లాదేశ్లోని ఝులోకటి జిల్లాకు చెందినవాడిగా పోలీసులు గుర్తించారు. గత ఐదు నెలలుగా ముంబయిలో ఉంటున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. హౌస్ కీపింగ్ వంటి చిన్నచిన్న పనులు చేసినట్లు గుర్తించారు.



### వేలిముద్రలు సేకరించిన పోలీసులు..

సైఫ్పై దాడికి సంబంధించిన విచారణలో భాగంగా పలు ప్రాంతాల్లో నిందితుడి వేలిముద్రలు సేకరించినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక పోలీసులు క్రైమ్ బ్రాంచ్ విచారణలో భాగంగా వేలిముద్రలు సేకరించారు. ఫోరెన్సిక్ బృందం కూడా సైఫ్ భవనాన్ని సందర్శించినట్లు ఓ అధికారి తెలిపారు. దాడి జరిగిన ప్రదేశంలో నిందితుడి వేలిముద్రలు లభించాయన్నారు. ఇంట్లోని కిటికీలపై, ఇంట్లోకి వచ్చేందుకు ఉపయోగించిన నిచ్చెనపై నిందితుడి వేలిముద్రలు ఉన్నాయన్నారు.

### హోం డేకరేషన్

## మొక్కల నుంచి ఫంగస్ తొలగించే పద్ధతులు, చాలా సింపుల్

మొక్కలు పెంచాలి అన్న ఆలోచన ఉండే సరిపోదు.. వాటిని పెంచడం కూడా తెలిసి ఉండాలి. మొక్కలకు సరైన సంరక్షణ లేకపోవడం లేదా అధిక మొత్తం నీరు పోయడం వల్ల వాటికి ఫంగస్ పడుతుంది. దీంతో.. మొక్క మొత్తం పాడవుతుంది.

ఈ రోజుల్లో చాలా మంది గార్డెనింగ్ ఇష్టపడుతున్నారు. చిన్న స్థలం ఉన్నా సరే అక్కడ మొక్కన పెంచుతున్నారు. నగరాల్లో నివసించే ప్రజలు కుండీల్లో మొక్కల్ని నాటుతున్నారు. ఇక, సాధారణంగా గార్డెన్‌లో పూలు, పండ్లతో పాటు ఇతర గార్డెనింగ్ మొక్కల్ని పెంచుతుంటాం. మన పెరడు లేదా బాల్కనీలో కొన్ని రకాల మొక్కలను పెంచడం ద్వారా శారీరక, మానసిక, ఆరోగ్యపరమైన లాభాల్ని పొందవచ్చు. అయితే, మొక్కలు పెంచాలి అన్న ఆలోచన ఉండే సరిపోదు.. వాటిని పెంచడం కూడా తెలిసి ఉండాలి. మొక్కలకు సరైన సంరక్షణ లేకపోవడం లేదా అధిక మొత్తం నీరు పోయడం వల్ల వాటికి ఫంగస్ పడుతుంది. దీంతో.. మొక్క మొత్తం పాడవుతుంది. కొన్ని సార్లు వాతావరణం వల్ల కూడా మొక్కలకు ఫంగస్ పడుతుంది. ఇది మొక్కల ఆకులు, పై భాగాన్ని దెబ్బతీయడమే కాకుండా మూలాల్ని కూడా నాశనం చేస్తుంది. ఫంగస్ కారణంగా మొక్క చనిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. తెల్ల ఫంగస్ మొక్కల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఇండోర్, పెరట్లో పెంచే మొక్కలు తెల్ల ఫంగస్ వల్ల ఎఫెక్ట్ అవుతాయి. ఈ ఫంగస్ ఒక్కోసారి మొత్తం మొక్కకు పాకి నాశనం చేస్తుంది. అందుకే ఇంట్లో పెంచే మొక్కల్ని ఫంగస్ నుంచి రక్షించుకోవాలి. ఇందుకు కొన్ని చిట్కాలు ఉన్నాయి. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.





### వేప నూనె..



వేప నూనె మొక్కల నుంచి ఫంగస్‌ను తొలగించడంతో ప్రభావవంతంగా పనిచేస్తుంది. నిజానికి ఇది సహజమైన క్రిమిసంహారకంగా పనిచేస్తుంది. మొక్కలకు దీన్ని వాడటం కోసం.. ముందుగా రెండు లీటర్ల నీటిని తీసుకోండి. ఈ నీటిలో రెండు టీ స్పూన్ల వేప నూనె వేసి బాగా కలపండి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని స్ప్రే బాటిల్‌లో నింపి ఫంగస్ సోకిన మొక్కపై చల్లాలి. వేప నూనెలో ఉండే గుణాలు.. ఫంగస్‌తో పోరాడుతాయి. దీంతో.. ఫంగస్ చాలా త్వరగా నశిస్తుంది.

### యాపిల్ సైడర్ వెనిగర్..



మొక్కలపై ఫంగస్‌ను చంపడానికి, ఆకుల నుంచి తెల్లటి మచ్చల్ని తొలగించడానికి యాపిల్ సైడర్ వెనిగర్ బెస్ట్ ఆప్షన్. ఇందుకోసం ఒక లీటర్ నీటిలో రెండు టేబుల్ స్పూన్ల యాపిల్ సైడర్ వెనిగర్ కలపండి. ఈ మిశ్రమాన్ని బాగా కలపండి. తర్వాత ఈ ద్రావణాన్ని ఫంగస్ సోకిన ఆకులు, కాండంపై పిచికారీ చేయాలి. మొక్క నుంచి ఫంగస్ పూర్తిగా తొలిగిపోయే వరకు ఈ రెమెడీని వారానికి రెండు నుంచి మూడు సార్లు ప్రయత్నించండి. ఈ ద్రావణం వల్ల ఫంగస్ పూర్తిగా నాశనమవుతుంది.

### బేకింగ్ సోడా..




వంటల్లో ఉపయోగించే బేకింగ్ సోడా మొక్కల నుంచి ఫంగస్‌ను తొలగించడంలో సాయపడుతుంది. ఇందుకోసం రెండు లీటర్ల నీటిలో సగం టీ స్పూన్ లిక్విడ్ సోప్, ఒక టేబుల్ స్పూన్ బేకింగ్ సోడా కలపండి. ఆ తర్వాత వీటిని బాగా కలిపి ద్రావణాన్ని తయారుచేసుకోండి. ఈ ద్రావణాన్ని వెంటనే వాడకూడదు. ఈ మిశ్రమాన్ని రెండు నుంచి మూడు రోజుల పాటు అలాగే ఉంచండి. తర్వాత ఈ ద్రావణాన్ని స్ప్రే బాటిల్‌లో తీసుకుని.. ఫంగస్ సోకిన మొక్కలోని ప్రతి భాగానికి పిచికారీ చేయాలి. ఫంగస్ పూర్తిగా తొలిగిపోయే వరకు ఈ మిశ్రమాన్ని ఉపయోగించండి. అయితే, సూర్యకాంతిలో మాత్రం పిచికారీ చేయకండి. సూర్యరశ్మి తక్కువ ఉన్న సమయంలో మాత్రమే మొక్కకు ఈ మిశ్రమాన్ని పిచికారీ చేయాలి.

### మౌత్ వాష్..



తెల్లటి ఫంగస్ నుంచి మొక్కలను రక్షించడానికి ఇథనాల్ ఆధారిత మౌత్ వాష్ చాలా మంచి ఎంపిక. ఇందుకోసం ఒక క్యాప్ ఫుల్ మౌత్ వాష్‌ను లీటర్ నీటిలో కలపండి. ఆ తర్వాత మొక్క ప్రభావిత ప్రాంతాల్లో స్ప్రే చేయాలి. తెల్లటి ఫంగస్‌కు మౌత్‌వాష్ ప్రభావవంతమైన నివారణ. అయితే, ఇది కొత్త మొక్కల పెరుగుదలకు మాత్రం హానికరం. అందుకే దీనిని ఎక్కువ మోతాదులో వాడకూడదు. తక్కువ పరిమాణంలో ఉపయోగిస్తే ఫంగస్ నశిస్తుంది.

### ఈ విషయాలు కూడా ముఖ్యం..



ఫంగస్ తేమను ఇష్టపడుతుంది. అందుకే మొక్కలు ఎక్కువ తేమలో ఉండకూడదు. నీటిని ఎక్కువ పోయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోండి. అంతేకాకుండా ఉష్ణోగ్రతలు కూడా మొక్కపై ప్రభావం చూపిస్తాయి. ఉష్ణోగ్రతల్ని బట్టి మొక్కను కాపాడుకోండి. మొక్కలు పెరిగే మట్టి పొడిగా ఉన్నప్పుడు మాత్రమే మొక్కలకు నీరు పోయండి. అధిక తేమ ఫంగస్‌కు కారణమవుతుంది. అందుకే మొక్కలకు ఎక్కువ నీరు పోయకూడదు. మార్కెట్ నుంచి కొత్త మొక్కల్ని తీసుకు వచ్చేటప్పుడు.. వాటిని జాగ్రత్తగా గమనించండి. అవి అప్పటికే ఫంగస్ బారిన పడ్డాయో లేదో చెక్ చేయండి. ఏదైనా ఇంటి చిట్కా పాటించే ముందు.. మొక్క ప్రభావిత భాగానికి కచ్చితంగా ప్యాచ్ టెస్ట్ చేయాలి. గమనిక..ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం.